ఈ రోడ్డులో ప్రయాణం నరకమే!


బురదమయంగా మారిన నిభానుపూడి-నిమ్మకూరు రహదారి


అధ్వానంగా ఉన్న ఉంద్రపూడి రహదారి

పట్టించుకోని అధికారులు

నిభానుపూడి(పామర్రు): మండలంలోని నిభానుపూడి గ్రామం నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న నిమ్మకూరుకు వెళ్లే రహదారి బురదమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ నిభానుపూడి గ్రామస్తులు నిమ్మకూరుకు వెళ్లి వారి అవసరాలు తీర్చుకోవాలి. అయితే ఈ రహదారిలో మట్టి తోలకాలు విపరీతంగా జరిగి ఆ మట్టి రహదారిపై పడటంతో ఇది మట్టి రోడ్డుని తలపిస్తోంది. కొద్ది పాటి వర్షానికి రహదారి బురదమయంగా మారి ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది. రోజూ వందలాది మంది ప్రజలు రైతులు, విద్యార్థులు ఈ రహదారి గుండా ప్రయాణించి తమ పనులు నిర్వహించాల్సి ఉంటుంది. రహదారి బురద మయంగా మారటం కారణంగా ద్విచక్రవాహనదారులు బురద రోడ్డులో జారి పడి క్షతగాత్రులుగా మారుతున్నారు.

రాత్రిళ్లు ప్రయాణం నరక యాతన

రాత్రి వేళల్లో నిభానుపూడి వెళ్లాలంటే నిమ్మకూరు గ్రామస్తులు నరకాన్ని చవి చూస్తున్నారు. గోతుల రహదారి , పైగా బురదమయం, సరిగా వెలగని వీధి దీపాలతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అధ్వానంగా ఉంద్రపూడి రహదారి

ఉంద్రపూడి(పామర్రు): స్థానిక వీరాంజనేయస్వామి దేవస్థానం నుంచి పోలవరం, ఉంద్రపూడి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురద మయంగా మారింది. దీనితో ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలకు అనేక అవస్థలు పడుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న నానుడు వాన కారణంగా రోడ్లు బురదమయంగా మారాయి. గతంలో నిభానుపూడి, నిమ్మకూరు గ్రామాల నుంచి ఈ రహదారి మీదుగా మట్టి ట్రాక్టర్ల తోలకాలు జరపడంతో ఈ రహదారి మట్టితో నిండి పోయింది. దీంతో అది ఇప్పుడు వర్షాలకు బురద మయంగా మారింది. ఈ కారణంగా గ్రామస్తులు ఈ రహదారిలో ప్రయాణించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు జారిపోయి పడిపోతూ గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారిని అభివృద్ధి పర్చాలని పోలవరం, ఉంద్రపూడి గ్రామస్తులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



నిభానుపూడి గ్రామం నుంచి ఎక్కడికి వెళ్లాలన్నా ఈ రహదారి గుండా ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ రహదారి బురదమయంగా మారటం కారణంగా ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. తప్పని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నాం. అధికారులు స్పందించాలి.

– అబ్దుల్ ఆషా, గృహిణి, నిభానుపూడి

బడికి వెళ్లాలంటే భయం



నిభానుపూడి నుంచి నిమ్మకూరులోని హైస్కూల్‌కు వెళ్లాలంటే చాలా భయంగా ఉంది. రహదారి బురద మయంగా మారటంతో సైకిల్‌పై వెళ్లే పరిస్థితి కూడా లేదు. అవస్థలు పడుతున్నాం. రహదారిలో బురద కారణంగా సైకిల్ జారి పోయి పడిపోవడం, దెబ్బలు తగలటం జరుగుతోంది. దీంతో బడికి వెళ్లాలన్నా కూడా భయం వేస్తోంది. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలి.

– రమీజా సుల్తానా, విద్యార్థిని, నిభానుపూడి

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పాలి

కైలే అనిల్‌కుమార్,
వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి


పామర్రులో నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్

పామర్రు: కూటమి ప్రభుత్వ నిరంకుశ ధోరణిని ప్రజలలోకి తీసుకువెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పామర్రు పట్టణ నాయకులు బుధవారం కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో అబద్ధపు వాగ్దానాలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండగట్టాలని అన్నారు. ప్రజలను మోసం చేయటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పనులను తెలియజేసి పార్టీ పట్ల వారిని ఆకర్షితులను చేయాలన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేసి వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిరంతరం ప్రజలకు చేరువలో ఉంటూ వారి అవసరాలను తెలుసుకుని వాటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమవ్వాలని అన్నారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు.

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం

పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పార్టీ కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటామని అన్నారు. ఎవరికి ఎటువంటి అవసరం వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని, రానున్న కాలంలో పార్టీకి మంచి రోజులు వస్తాయని అన్నారు. కూటమి నేతలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వారి పక్షాన పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఏడాది కూటమి పాలనకు ప్రజలు విసుగెత్తిపోయారని ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వర రెడ్డి, పామర్రు టౌన్ అధ్యక్షుడు నందిపాటి సురేష్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆరేపల్లి శ్రీహరి, ఎం.వెంకటరెడ్డి, ఎస్.సింహాచలం, నత్తా నాని పాల్గొన్నారు.

టిడ్కో కాలనీ రుణాలు మాఫీ చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న టిడ్కో కాలనీ లబ్ధిదారులు

గుడివాడటౌన్: కూటమి ప్రభుత్వ నాయకులు గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. కాలనీలో బుధవారం లబ్ధిదారులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము తాను గెలిస్తే సొంత డబ్బుతో కాలనీ రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికీ ఆ హామీలు నిలబెట్టుకోకపోగా లబ్ధిదారులు ఇబ్బంది పడుతుంటే చోద్యం చూస్తున్నారన్నారు. తక్షణమే ఎమ్మెల్యే స్పందించి రుణమాఫీ చేయాలని, లేని పక్షంలో జూలై 9న పట్టణ బంద్‌కు పిలుపునిస్తామని అభివృద్ధి కమిటీ సభ్యులు హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్.శివరాం ప్రసాద్, బి.నాగవాణి, సభ్యులు వి.రంగారావు, ఎ.లక్ష్మి, మూడెడ్ల ఉమా తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన ఆల రమేష్


మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఆల రమేష్

పెదపారుపూడి: జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఆల రమేష్ బుధవారం రాత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బీసీ విభాగం పనితీరును, బీసీ సమస్యలపై పోరాటం చేసి పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను ఆయనకు వివరించారు. కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మోసపూరిత హామీల పైన ప్రజల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన భుజం తట్టి కష్టపడి పనిచేసే నాయకులకు పార్టీ అండగా ఉంటుందని, రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీకి మంచి జరుగుతుందని చెప్పినట్టు రమేష్ తెలియజేశారు.

ఇరాన్‌పై అమెరికా దాడికి నిరసనగా ధర్నా


నెహ్రూ చౌక్ సెంటర్లో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: ప్రపంచ పోలీసు లాగా ప్రవర్తిస్తున్న అమెరికా దుష్ట విధానాలను శాంతి కాముకులంతా ఐక్యంగా తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు నీలం మురళీకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్‌లో ఇరాన్‌పై అమెరికా దాడికి నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా పాలస్తీనాపై పాశవికంగా దాడి చేస్తున్న ఇజ్రాయిల్‌ను అమెరికా సమర్థించటం సిగ్గుచేటన్నారు. యుద్ధాలు ప్రజా జీవితాన్ని నిర్వీర్యం చేస్తా యని, యుద్ధోన్మాదాన్ని సీపీఎం పూర్తిగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా అమెరికా తన విధానాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి, ఐద్వా కార్యదర్శి రజని, నాయకులు సురేంద్ర, శివనాగమల్లేశ్వర రావు, కొండా, ఎలీషా రావు, నారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి


కొమరవోలులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏవో శివనాగరాణి


వల్లూరుపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీదేవి

కొమరవోలు(పామర్రు): వరి సాగులో నారుమడులలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని పామర్రు ఏవో శివనాగరాణి అన్నారు. మండలంలోని కొమరవోలు, జమీగొల్వేపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారుమడులు పోసుకునే ముందు విత్తనాలను శుద్ధి చేసుకోవాలని అన్నారు. విత్తన శుద్ధి వలన నారుమళ్లకు తెగుళ్లు, పురుగు ఆశించదని అన్నారు. యాజమాన్య పద్ధతులు పాటించి నారుమళ్లకు సరైన పోషణ అందించాలన్నారు. నారుమళ్లలో ఎక్కువ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, అధిక మోతాదులో యూరియా తదితరాలను వాడకూడదని సూచించారు. నారుమళ్లు ఏపుగా పెరిగిన తర్వాత మాత్రమే నాట్లు వేయాలని అన్నారు. ఈ విధంగా చేయటం వలన వరి ఏపుగా పెరిగి అధికంగా దిగుబడులు రావచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వరి నారు పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

తోట్లవల్లూరు: వరి నారుమడి పెంపకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి గూడపాటి శ్రీదేవి సూచించారు. మండలంలోని వల్లూరుపాలెం, బొడ్డపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు బుధవారం జరిగాయి. ఆయా గ్రామాల్లో వరి నారుమడులను శ్రీదేవి పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించారు. నారుమడుల్లో ఐరన్ లోపం కనిపిస్తోందని, దీని నివారణకు అన్నబేధి, నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పంటల సాగులో జీవన ఎరువులు వినియోగం లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యాన అధికారి మానస, వ్యవసాయ సహాయకులు గోపి, యశ్వంత్ పాల్గొన్నారు.

సన్నరకాలు సాగుచేయండి


బొమ్మినంపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

ముదినేపల్లి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేపట్టే రైతులు సన్నరకాలు సాగు చేయాలని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు, అల్లూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ వినియోగదారుల నుంచి అధిక డిమాండ్, దిగుమతులకు అవకాశం ఉన్నందున సన్నరకాల బియ్యానికి సంబంధించి వరిసాగు చేపడితే రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఇతర రకాలతో పోలిస్తే ఈ రకంకు అధిక ధర పొందవచ్చన్నారు. మండలంలోని కౌలురైతులు స్థానిక వీఆర్వోలను సంప్రదించి కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందవచ్చన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు సంబంధిత డీలర్ల నుంచి బిల్లులు తీసుకోవడంతో పాటు మొలక శాతాన్ని పరీక్షించుకున్న తరువాత మాత్రమే ఉపయోగించాలన్నారు. ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి సతీష్, స్థానిక వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించుకోవాలి


తహసీల్దార్ నుంచి బీఎల్‌ఏ నమోదు పత్రాలను అందుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కైకలూరు: రాజకీయ పార్టీలు బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించుకోవాలని కై కలూరు తహసీల్దారు ఎం డీ.ఇబ్రహీం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో కైకలూరు తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలు పార్టీల నాయకులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 237 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, వీటన్నింటికి బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వో)లు ఉన్నారన్నారు. ప్రతి పార్టీ నుంచి అన్ని బూత్‌లకు ఒక్కొక్క బూత్ లెవల్ అసిసెంట్ల(బీఎల్‌ఏ)ను నియమించుకోవాలన్నారు. ప్రతి పార్టీ నాయకులు తమతమ బీఎల్‌ఏల ఫొటోలతో వివరాలు నింపి సమాచారాన్ని అందించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు బేతపూడి ఏసోబురాజు, బోయిన రామరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు, జనసేన మండల అధ్యక్షుడు ముమ్మిరెడ్డి నాగమల్లేశ్వర రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ హోమియో వైద్యాధికారిగా లక్ష్మి బాధ్యతల స్వీకారం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి పీహెచ్‌సీ హోమియో వైద్యాధికారిగా ఆర్.లక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ హేమలత గుడివాడ హోమియో ఆసుపత్రికి బదిలీ కాగా గుడివాడ నుంచి డాక్టర్ లక్ష్మి ఇక్కడకు వచ్చారు. పశువైద్యశాల ఇన్‌చార్జి వైద్యుడిగా క్రాంతికుమార్ మండలంలోని ప్రొద్దువాక, పెదగొన్నూరు పశువైద్యశాలల ఇన్‌చార్జి వైద్యుడిగా ముదినేపల్లి వైద్యాధికారి క్రాంతికుమార్ బాధ్యతలు చేపట్టారు. పెదగొన్నూరు పశువైద్యశాల పోస్టు కొన్నేళ్లుగా ఖాళీగా ఉండగా ప్రొద్దువాక వైద్యాధికారి రామకృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ప్రస్తుతం రామకృష్ణ బదిలీపై వెళ్లడంతో క్రాంతికుమార్ బాధ్యతలు చేపట్టారు.

కార్మికుని కుటుంబానికి వితరణ

గుడివాడటౌన్: ప్రమాదంలో గాయపడి మృతి చెందిన కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటో మొబైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. స్థానిక బాపూజీనగర్‌కు చెందిన కె.దినేష్ బాబు కుటుంబానికి బుధవారం వారు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ అసోసియేషన్ సభ్యులు ఆపదలో ఉన్నా, గాయాలపాలైనా, మృతి చెందినా వారిని ఆదుకోవటానికి అన్ని వేళలా సిద్ధంగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్, గౌరవాధ్యక్షుడు టి.లక్ష్మణరావు, నాయకులు షేక్ మొహిద్దీన్ బాషా, కె.నటరాజ్, ఎండీ రషీద్ బేగ్, శ్యామ్‌కుమార్ రెడ్డి, నాగరాజు, ఎ.వెంకటరమణ, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజుల కొట్టాడలో శాంతి కమిటీ ఏర్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్, ఎస్ఐ రాంబాబు

కైకలూరు: సిమెంట్ రోడ్డుపై ఏర్పడిన స్వల్ప వివాదంలో మంగళవారం ఇరు వర్గాలు ఘర్షణకు దిగిన నేపథ్యంలో బుధవారం రాజుల కొట్టాడ గ్రామంలో శాంతి కమిటీని ఏర్పాటు చేసినట్లు కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. రెండు వర్గాలపై కేసులు నమోదు చేశామని,గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి స్టేషన్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొందని చెప్పారు.

రేపు కైకలూరులో జగన్నాథుని రథయాత్ర

కై కలూరు: పూరీ తరహాలో జగన్నాథుని రథయాత్ర శుక్రవారం గ్రీన్ విలేజ్ శ్రీశ్రీ రాధాకృష్ణ మందిరం(ఇస్కాన్) ఆధ్వర్యంలో జరుగుతుందని నిర్వాహకుడు రాధావల్లభ దాస్ బుధవారం చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రథయాత్ర శ్యామలాంబ దేవస్థానం, మెయిన్ రోడ్, ఆటపాక, కోరుకొల్లు రోడ్ సెంటర్, సాయిబాబా మందిరం, వెలమపేట, గీతామందిరం, ఫైర్ స్టేషన్ మీదుగా తిరిగి శ్యామలాంబ దేవస్థానంకు చేరుతుందన్నారు. అక్కడ వివిధ పూజా కార్యక్రమాల అనంతరం భారీ అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

రహదారుల వెంబడి చెత్త తొలగింపు


ఆటపాకలో చెత్తను ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం

కైకలూరు: జాతీయ రహదారి వెంబడి చెత్త పేరుకుపోవడంపై ఇటీవల సీఈసీ కమిటీ పర్యటనకు వచ్చిన ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం పంచాయతీ సిబ్బంది రహదారుల వెంబడి చెత్తను తొలగించారు. ఆటపాక పంచాయతీలో నాగాపురం, రిలయన్స్ పెట్రోల్ బంకు ప్రధాన రహదారిలో పొక్లెయిన్‌తో చెత్తను ట్రాక్టర్లపై తరలించారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ చెత్త తొలగించిన ప్రాంతంలో మట్టిని నింపి మొక్కలు నాటుతామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కొండలరావు, విలేజ్ అసిస్టెంట్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 137 మంది హాజరు



పెడన: నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో బుధవారం డీఎస్సీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం137 మంది హాజరుకాగా, 41మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజారమేష్ తెలిపారు.

వ్యక్తి స్వేచ్ఛను కాలరాసిన ఎమర్జెన్సీ


ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మాట్లాడుతున్న న్యాయవాది శరత్‌బాబు

కైకలూరు: వ్యక్తి స్వేచ్ఛను కాలరాసిన ఎమర్జెన్సీ ఓ పీడకల అని ప్రముఖ న్యాయవాది కారె శరత్‌కుమార్ అని అన్నారు. ఇందిరాగాంధీ పాలనలో ఎమర్జెన్సీ విధించి యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా కై కలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చరిత్రశాఖ ఆధ్వర్యంలో బుధవారం సంవిధాన్ హత్య దివస్ కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో శరత్‌బాబు మాట్లాడుతూ 1975 జూన్ 25 నుంచి దాదాపు 21 నెలల పాటు అత్యయిక పరిస్థితి కొనసాగిందన్నారు. పత్రికా స్వేచ్ఛకు సైతం సంకెళ్లు పడ్డాయన్నారు. అనేకమంది జైళ్ల పాలయ్యారన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిందన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలత, చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ ఎం.హరి ప్రసాద్ మాట్లాడుతూ పాలకులు ఎవరైనా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రాజ్యాంగ హక్కులపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల్లో అవకతవకలు గుర్తింపు

మండవల్లి: గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై మంగళవారం రాత్రి 10 గంటల వరకు ప్రజావేదిక జరిగింది. కనీసం పారతో మట్టి తీయకుండానే అడుగు మేర మట్టి తీసినట్లు రికార్డులు రాశారని, కొలతలు తేడాగా ఉన్నాయని సామాజిక తనిఖీలో వెల్లడైంది. ఉపాధిపనులు నిర్వహించినట్లు సంబంధిత ఫొటోలు కూడా లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. అయ్యవారిరుద్రవరంలో 480 మొక్కలు నాటినప్పటికీ 210 మాత్రమే మిగిలాయని, అవి కూడా చనిపోయే స్థితిలో ఉన్నాయని, నీళ్ల పోసినట్లు, పర్యవేక్షించినట్లు డబ్బులు విత్‌డ్రా చేశారని గుర్తించారు. నిబంధనల ప్రకారం పనులు జరిగితేనే బిల్లులు చెల్లిస్తామని, లేనిపక్షంలో రికవరీ చేయిస్తామన్నారు. స్టేట్ సోషల్ ఆడిట్ ప్రోగ్రాం మేనేజర్ సునీల్‌కుమార్, ఏపీడీ జాన్ విక్టర్, డీవీఓఎం బుజ్జి, ఎస్‌ఆర్‌పీ వెంకటేశ్వర్లు, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు, భలే యేసురాజు, ముంగర ఏడుకొండలు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తుల పరిరక్షణే ధ్యేయం



గుడ్లవల్లేరు: గ్రామ పంచాయతీ ఆస్తుల పరిరక్షణే ప్రధాన ధ్యేయమని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ అన్నారు. డాక్టర్ బండారుతో పాటు గ్రామస్తుల అభ్యర్థన మేరకు బుధవారం సింగలూరులోని గ్రామ పంచాయతీకి చెందిన 5.88 ఎకరాల మంచినీటి చెరువు సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, గ్రామ కార్యదర్శి చాపరాల రాజేష్, వీఆర్వో సనకా భాస్కరరావు, గ్రామ సర్వేయరు రవళి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి బహూకరణ



పమిడిముక్కల: పెనుమత్స మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లోని విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన దాత మొవ్వ రామచంద్రరావు రూ.21 వేల విలువైన విద్యసామగ్రి అందజేశారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో దాత రామచంద్రరావు, హెచ్ఎం ఫణికుమార్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, డైరీలు, కాపీ రైటింగ్ బుక్స్ పంపిణీ చేశారు. గత 23 సంవత్సరాలుగా ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు సంవత్సరానికి సరిపడ విద్యా సామగ్రి అందజేస్తున్న దాత రామచంద్రరావును హెచ్ఎం ఫణి, ఉపాధ్యాయులు అభినందిచారు. గ్రామస్తులు పూర్ణచంద్రరావు, పాగోలు కుమార్ పాల్గొన్నారు.

నిమ్మకూరులో నారా లోకేష్ సందడి



నిమ్మకూరు(పామర్రు): మచిలీపట్నం పర్యటనలో భాగంగా అన్న ఎన్టీఆర్ స్వగ్రామమైన పామర్రు మండలం నిమ్మకూరు గ్రామం వద్ద మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి లోకేష్‌కు గజమాలలతో గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక మహిళలు లోకేష్‌కు మంగళ హారతులు పట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు వల్లూరిపల్లి గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, నాయకులు అనగాని మురళీ, కేదారేశిపల్లి శ్రీను, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని కొత్తపల్లి, పెదపాలపర్రు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ లైన్లకు దగ్గర్లో ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ముదినేపల్లి విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని దేవపూడి, అల్లూరు, రామచంద్రపురం, బొమ్మినంపాడు, పెదపాలపర్రు, కలవపూడి అగ్రహారం, రాఘవాపురం, పర్నాస, రెడ్డిపూడి, తేరగూడెం, పేరూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.